ఫొటో ట్రెండ్.. ఫుల్ డిమాండ్





మార్కెట్‌లో అందుబాటులో ఉన్న వివిధ రకాల గిఫ్ట్‌లు

- కస్టమైజ్డ్ గిఫ్ట్‌లకు పెరుగుతున్న ఆదరణ
- అన్నివర్గాల ప్రజలకు అందుబాటు ధరలు

బోట్‌క్లబ్: బంధువులు, స్నేహితులు గతంలో బహుమతులు ఇవ్వాల్సి వస్తే ఇంటిలో అలంకరించుకొనే వస్తువులే ఇచ్చేవారు. ఇంటిలో పెట్టుకొనేందుకు దేవుడు బొమ్మలు, గోడ గడియారాలు, సీనరీలు వంటివి ఎక్కువ ఉండేవి. కానీ ప్రస్తుతం ట్రెండ్ మారింది. వారి ఫొటోలను వారికే బహుమతులు అందిస్తున్నారు.

ప్రస్తుతం మార్కెట్‌లో కస్టమైజ్డ్ గిఫ్ట్‌లకు మంచి గిరాకీ వచ్చింది. మనం ఎవరికైతే బహుమతి ఇవ్వాలనుకుంటున్నామో వారికి బొమ్మలతో కూడిన బహుమతులు అందిస్తున్నారు. ఈ గిఫ్ట్‌లు రకరకాలు అందుబాటులోనికి వచ్చాయి. తలగడ దిండు, టీ కప్పులపై ఫొటోలు, వాల్‌పై పెట్టుకొనే రకరకాల డిజైనర్‌లో గిఫ్ట్‌లు ఉన్నాయి. గిఫ్ట్ డిజైన్‌లో భాగంగా ఫొటోలు పెట్టేందుకు వాటిని సేకరించడం పెద్దగా కష్టపడాల్సిన అవసరం లేదు. ఎందుకంటే ప్రస్తుతం ప్రతి ఒక్కరూ ఫంక్షన్లు, వాట్సాప్, ఫేస్‌బుక్ వంటి సామాజిక మాధ్యమాల్లో ఫొటోలు షేర్ చేస్తున్నారు. వాటిని భద్రపరుచుకొని వారి ఇంటిలో పుట్టినరోజు, పెళ్లిరోజు వంటి శుభకార్యాలకు వారి ఫొటోలతో అందంగా తయారు చేసిన బహుమతులను ఇవ్వడంతో వాటిని చూసి వారు మురిసిపోతున్నారు. దీంతో నగరంలో ఈ కస్టమైజ్డ్ గిఫ్ట్‌లు షాపులకు గిరాకీ పెరిగింది. గతంలో కాకినాడలో రెండు మూడు షాపులు మాత్రమే ఉండేవి. ప్రస్తుతం వీటికి మంచి గిరాకీ రావడంతో 10కిపైగా షాపులు ఏర్పాటు చేశారు. ప్రస్తుతం వీరికి చేతినిండా పనిదొరుకుతోంది.

కంప్యూటర్‌పై ప్రింటింగ్‌తో నాణ్యత

ఎదుట వారికి ఇచ్చే బహుమతులు వారి ఫొటో మనం ఇస్తే ఆ ఫొటో నాణ్యతతో తగ్గకుండా కంప్యూటర్‌పై ప్రింటింగ్ చేయడంతో రకరకాలు



స్టైల్స్‌లో మనకు కస్టమైజ్డ్ గిఫ్ట్‌లు మార్కెట్‌లో అందుబాటులోకి వచ్చాయి. గోడకు తగిలించుకొనే బొమ్మలతోపాటు, కార్లులో పెట్టుకొనే దిండులు ఇలా రకారకాల డిజైన్‌లో ఈ కస్టమైజ్డ్ గిఫ్ట్‌లను కంప్యూటర్ ద్వారా ప్రింట్ చేస్తున్నారు.

రెండేళ్ల క్రితం నష్టాలే..

రెండు సంవత్సరాలు క్రితం కాకినాడ నగరంలో వివిధ ప్రాంతాల్లో కస్టమైజ్డ్ గిఫ్ట్ షాపులు వచ్చినప్పటికీ అంత వ్యాపారం లేక వ్యాపారులు డీలా పడ్డారు. వినియోగదారులు వీటికి పెద్దగా తెలియకపోవడంతో బేరాలు లేక షాపు యజమానులు ఇబ్బందులు పడ్డారు. ప్రస్తుతం ఆన్‌లైన్‌లో కూడా ఆర్డర్లు ఎక్కువగా వస్తున్నాయి. బహుమతులు ఇచ్చివారు అందుబాటులో లేకపోయినా తమ బంధువుల ఫొటోలు పెట్టి వారికి నచ్చిన గిఫ్ట్ ఇచ్చేలా ఆన్‌లైన్ సర్వీస్‌లు అందుబాటులోకి తెచ్చారు. డబ్బులు సైతం ఆన్‌లైన్‌లో చెల్లించే వెసులుబాటు రావడంతో వారు ఇక్కడకు వచ్చి గిఫ్ట్‌లు ఇచ్చే పరిస్థితి కూడా లేకపోవడంతో అంతా ఆన్‌లైన్‌లో ఆర్డర్లు తీసుకొని వారి బంధువులకు పంపే ఏర్పాట్లు చేస్తున్నారు. దీంతో వీరికి మంచిగా వ్యాపారం సాగుతోంది.

పెరిగిన బేరాలు



రెండేళ్లు అసలు బేరాలు ఉండేవి కాదు. సిబ్బందికి, షాపు అద్దెలు చెల్లించేందుకు ఇబ్బందులు పడ్డాం. ప్రస్తుతం కస్టమైజ్ గిఫ్ట్‌లు తమ బంధువులు, స్నేహితులకు ఇచ్చేందుకు ప్రజలు ఆసక్తి చూపుతున్నారు. దీంతో బేరాలు బాగా వస్తున్నాయి. ఆన్‌లైన్ వారికి కావాల్సిన గిఫ్ట్‌లు పంపే ఏర్పాట్లు చేశాం.

– సాయి, కస్టమైజ్డ్ గిఫ్ట్ షాపు, నిర్వాహకుడు

గిఫ్ట్‌లు బాగున్నాయి



ప్రస్తుతం మార్కెట్‌లోకి వచ్చిన కస్టమైజ్డ్ గిఫ్ట్‌లు బంధులువు, స్నేహితులకు ఇచ్చేందుకు ఎంతో బాగుంటున్నాయి. మనం ఇచ్చే బహుమతిని చూసి వారి చాలా ఆనందంగా వ్యక్తం చేస్తున్నారు. మనకు కావాల్సిన రేటులో కూడా మనకు కస్టమైజ్డ్ గిఫ్ట్‌లు అందుబాటులో ఉన్నాయి. వాటిని ఆన్‌లైన్ ద్వారా కూడా పంపిస్తున్నారు.

– అంకంరెడ్డి రామునాయుడు, కస్టమైజ్ గిఫ్ట్ కొనుగోలుదారుడు

క్లుప్తంగా

కోరమాండల్ విశ్రాంత ఉద్యోగుల సంఘ కార్యవర్గం ఎన్నిక



బోట్‌క్లబ్‌లో కోరమాండల్ విశ్రాంత ఉద్యోగుల నూతన కార్యవర్గం

కాకినాడ రూరల్: సర్పవరం జంక్షన్‌లో బోట్ క్లబ్ ఉద్యానవనంలో ఆదివారం ఉదయం కోరమాండల్ ఎరువుల కర్మాగారం విశ్రాంత ఉద్యోగుల సంఘ నూతన కార్యవర్గం ఎన్నుకున్నారు. సంఘ ప్రస్తుత అధ్యక్షుడు పీటర్ జాన్ అధ్యక్షతన జరిగిన నూతన కార్యవర్గ ఎన్నికలో అధ్యక్షుడిగా అడబాల వీవీ సత్యనారాయణ, ఉపాధ్యక్షుడిగా హనుమంతరావు, ప్రధాన కార్యదర్శిగా కృష్ణారావు, కార్యదర్శిగా శ్రీనివాసరావు, కోశాధికారిగా నాగేశ్వరరావు, ప్రచార కార్యదర్శిగా నాగమహేష్, ఎన్నికయ్యారు. కార్యక్రమంలో రమణమూర్తి, సుదర్శన్, తదితరులు పాల్గొన్నారు.

అథ్లెటిక్స్ క్రీడలపై అవగాహన



జిల్లా అథ్లెటిక్స్ సంఘ సర్వసభ్య సమావేశం

నాగమల్లితోట జంక్షన్(కాకినాడ సిటీ): పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు అథ్లెటిక్స్ క్రీడలపై అవగాహన పెంచి వారిని క్రీడల్లో పాల్గొనేలా ప్రోత్సహించాలని అథ్లెటిక్స్ సంఘ జిల్లా అధ్యక్షుడు టీవీఎస్ రంగారావు పేర్కొన్నారు. కాకినాడ పీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో జిల్లా అథ్లెటిక్స్ సంఘ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఈ ఏడాది క్రాస్ కంట్రీ రాష్ట్రస్థాయి పోటీలు పెద్దాపురం ఎంఆర్ కళాశాలలో నిర్వహించాలని నిర్ణయించారు. సెప్టెంబర్ రెండో వారంలో జూనియర్స్ సెలక్షన్స కాకినాడలో నిర్వహించడానికి సభ్యులు ఆమోదం తెలిపారు. చీరాల స్టేట్‌మీట్‌లో పతకాలు సాధించిన క్రీడాకారులను అభినందించారు. ఈ సమావేశంలో అథ్లెటిక్స్ సంఘ కార్యదర్శి సుబ్రహ్మణ్యం, ట్రెజరర్ వర్మ, కొండరావు, బంగార్రాజు, గిరి, ప్రవీణ్; త్రిపుల తదితరులు పాల్గొన్నారు.

చిరంజీవిని కుమారికి నేడు దుర్గాబాయి దేశ్‌ముఖ్ అవార్డు

బోట్‌క్లబ్: ఇటీవల మృతి చెందిన ఐడియల్ కళాశాలల కరస్పాండెంట్ పి.చిరంజీవిని కుమారికి సోమవారం ఉదయం 11 గంటలకు ఐడియల్ కళాశాలలో వారి కుటుంబ సభ్యులకు దుర్గాబాయి దేశ్‌ముఖ్ అవార్డు అందించనున్నారు. ఆల్‌ఇండియన్ ఉమెన్స్ కాన్ఫరెన్స్ కార్యవర్గ సభ్యులు ఈ అవార్డును అందించనున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కాకినాడ సీపోర్టు చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ మెర్ల మురలీధర్ పాల్గొంటారని ఆల్‌ఇండియా ఉమెన్స్ కాన్ఫరెన్స్ అధ్యక్షురాలు ఎంవీ భరత లక్ష్మి, ట్రెజరర్ పద్మజావాణి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.

సంచార జాతులు.. సంస్కృతి వారధులు



ఓబీసీ మోర్చా బహిరంగ సభ కరపత్రాలను ఆవిష్కరిస్తున్న విశ్వేశ్వర్రావు

బోట్‌క్లబ్: సంచార జాతులు వారు సంస్కృతి వారధులని బీజేపీ జిల్లా అధ్యక్షులు బిక్కిన విశ్వేశ్వరరావు అన్నారు. స్థానిక బీజేపీ కార్యాలయంలో ఆదివారం పార్టీ ఓబీసీ మోర్చా కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ నెల 30న బీజేపీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న విముక్త జాతులు విముక్తి దినోత్సవ భారీ బహిరంగ సభ విజయవంతం చేయాలని పార్టీ నాయకులను సూచించారు. అనంతరం బహిరంగ సభ కరపత్రాలను ఆయన ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు యార్లగడ్డ రామ్‌కుమార్, పైడా రవీంద్ర, ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మచ్చా శివప్రసాద్, ఓబీసీ మోర్చా నాయకులు తామరపల్లి దుర్గాప్రసాద్, మేడ విజయలక్ష్మీ, దొడ్డి వీరేంద్ర, పాల్గొన్నారు.

సత్యదేవునికి పల్లకీ సేవ

అన్నవరం: రత్నగిరిపై సత్యదేవుడు, అనంత లక్ష్మీ సత్యవతీదేవి అమ్మవార్ల పల్లకీ సేవ ఆదివారం వైభవంగా జరిగింది. ఉదయం పది గంటలకు సత్యదేవుడు, అమ్మవార్ల ఉత్సవమూర్తులను ఊరేగింపుగా తూర్పురాజగోపురం లోపల ప్రాకారంలోకి ఊరేగింపుగా తీసుకువచ్చారు. అర్చకుడు కంచిబట్ల సాయి స్వామి, అమ్మవార్లకు పూజలు చేసి పల్లకీ సేవ ప్రారంభించారు. వేదమంత్రాలు, మంగళవాయిద్యాల నడు మ స్వామి, అమ్మవార్లను మూడుసార్లు ఆలయ ప్రాంగణంలో పల్లకీపై ఊరేగించారు. స్వామి, అమ్మవార్లకు పూజలు చేసి నీరాజన మంత్ర పుష్పాలు సమర్పించారు. కాగా ప్రతి ఆదివారం స్వామి, అమ్మవార్లను టేకు రథం మీద ఊరేగిస్తున్న విషయం తెలిసిందే. కాగా ఈ వారం వర్షం కురుస్తుండడంతో రథసేవ రద్దు చేసి పల్లకీమీద గోపురం లోపల ప్రాకారంలో స్వామి, అమ్మవారిని ఊరేగించారు.

జడివాన హోరు



రమణయ్యపేటలో పిఠాపురం రోడ్డుపై నిలిచిన నీరు

కాకినాడ రూరల్: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావంతో ఆదివారం రోజంతా వర్షం కురుస్తూనే ఉంది. ఉదయం ప్రారంభమైన వర్షపు చినుకులు క్రమేణా పెరుగుతూ ఓ మోస్తరు నుంచి భారీగా వర్షం పడడంతో కాకినాడ రూరల్‌లో పలు ప్రాంతాలు జలమయమయ్యాయి. ఆదివారం సెలవు రోజు కావడంతో ప్రజలు ఎక్కువగా ఇళ్లకే పరిమితమయ్యారు. వాహనదారులు వర్షపు నీటిలో ప్రయాణాలకు ఇబ్బందులు పడ్డారు.

ఘనంగా ఏపీయూడబ్ల్యూజే వ్యవస్థాపక దినోత్సవం

సాక్షి ప్రతినిధి, కాకినాడ: ఏపీ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్ వ్యవస్థాపక దినోత్సవాన్ని ఆదివారం కాకినాడలో ఘనంగా నిర్వహించారు. స్థానిక ఆర్అండ్‌బీ అతిథి భవనంలో ఏపీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్షుడు అంజిబాబు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు స్వాతి ప్రసాద్, ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్షుడు సాంబశివరావు హాజరై ఏపీయూడబ్ల్యూజే జెండాను ఆవిష్కరించారు. అనంతరం యూనియన్ ద్వారా అక్రిడేషన్ కమిటీలో ఎలక్ట్రానిక్ మీడియా నుంచి దురాని, ప్రింట్ మీడియా నుంచి శివన్నారాయణ రెడ్డిని జిల్లా కమిటీ ఏకగ్రీవంగా ప్రకటించింది. నూతనంగా నియమితులైన ఉపాధ్యక్షుడు స్వాతి ప్రసాద్, సీనియర్ జర్నలిస్టులు పరశురామ్, రాజేష్‌లను ఘనంగా సత్కరించారు. జర్నలిస్టులు పాల్గొన్నారు.

సంస్కారయుతంగా కళా ప్రక్రియను అధ్యయనం చేయాలి







పోటీల్లో ఆకట్టుకున్న చిన్నారులు



పోటీల్లో విజేతలకు బహుమతులు అందిస్తున్న సంస్కారభారతి కార్యవర్గ సభ్యులు

- గానకళ సంపాదకులు మునుగంటి వెంకట్రావు
- చిన్నారులకు శ్రీకృష్ణుడు వేషధారణ పోటీలు

బోట్‌క్లబ్: సంస్కారయుతంగా కళా ప్రక్రియను అధ్యయనం చేయాలని గానకళ సంపాదకులు మునుగంటి వెంకట్రావు అన్నారు. కృష్ణాష్టమి సందర్భంగా సంస్కారభారరతి ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక చల్లా ఫంక్షన్‌హాల్‌లో చిన్నారులకు శ్రీకృష్ణుడు వేషధారణ పోటీలు నిర్వహించారు. మన పూర్వీకులు నడచిన బాటలో మనము నడవాలన్నారు. ప్రపంచంలోనే భారతీయ సంస్కృతి సంప్రదాయాలు అజరామంగా నిలిచాయన్నారు. సంస్కారభారతి అధ్యక్షుడు ఆకొండి శ్రీనివాసరాజారావు మాట్లాడుతూ గత మూడు దశాబ్దాలుగా బాలగోకులం పేరిట బాలకృష్ణుడి వేషధారణ పోటీలు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. ఈ పోటీలకు న్యాయనిర్ణేతలుగా వ్యవహరించిన గొట్టుముక్కల వెంకట సత్య నరసింహశాస్త్రి మాట్లాడుతూ తల్లిదండ్రులు ఎంతో బాధ్యతగా తమ పిల్లలకు శ్రీకృష్ణుడి వేషధారణ వేసి పోటీలకు తీసుకోనిరావడం అభినందనీయమన్నారు. మూడు విభాగాల్లో పోటీలు నిర్వహించి వారికి బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో సంస్థ ఉపాధ్యక్షుడు ఓలేటి సత్యనారాయణ మూర్తి, ప్రముఖ పంచాంగ కర్త సరిపెల్ల శ్రీరామచంద్రమూర్తి పాల్గొన్నారు.

ఆధునిక పరికరాలతో క్యాన్సర్ ఆసుపత్రి నిర్మాణం



సమావేశంలో మాట్లాడుతున్న రెడ్ క్రాస్ రాష్ట్ర అధ్యక్షుడు రామారావు

బోట్‌క్లబ్: కాకినాడలో క్యాన్సర్ నివారణకు అత్యాధునిక పరికరాలతో ఆసుపత్రి నిర్మాణానికి రాష్ట్ర రెడ్ క్రాస్ సొసైటీ కృషి చేస్తుందని ఆ సంస్థ రాష్ట్ర అధ్యక్షులు వైడి రామారావు అన్నారు. కాకినాడ సత్కళావాహిని భవనంలో ఆదివారం జరిగిన ఎన్ఆర్ఐ తల్లిదండ్రుల సంఘ వార్షిక సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రాథమికంగా రెడ్ క్రాస్ సొసైటీతో పాటు దాతలు రూ.ఆరు కోట్ల సమకూరుస్తారన్నారు. ఓఎన్‌జీసీ సంస్థ పెద్ద మొత్తంలో నిధులు ఖర్చు చేసి విలువైన వైద్య పరికరాలు సమకూరుస్తుందని ఆయన వివరించారు. సమావేశానికి అధ్యక్షత వహించిన ఎన్ఆర్ఐ తల్లిదండ్రుల సంఘం అధ్యక్షులు పాలడుగు సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ వైడీ రామారావు తమ సంఘ ఉపాధ్యక్షులు కావటం గర్వకారణం అన్నారు. మధ్యతరగతి ప్రజలను ఆర్థికంగా అతలాకుతలం చేస్తున్న క్యాన్సర్ నివారణకు కాకినాడలో మంచి ఆసుపత్రి రావడం సంతోషకరమన్నారు. సంఘ కార్యదర్శి సీఎస్ఆర్ శర్మ మాట్లాడుతూ తమ సంఘములో 550 మందికిపైగా సభ్యులు ఉన్నారని సంఘం తరఫున పలు సేవా కార్యక్రమాలు చేయాలని నిర్ణయించుకున్నామన్నారు. సంఘంలో కొత్తగా సభ్యులుగా చేరిన జేఎన్టీయూ వైస్ ఛాన్సులర్ సీఎస్ఆర్‌కే ప్రసాద్ మాట్లాడుతూ ఇలాంటి సంఘాలు రాష్ట్రవ్యాప్తంగా ఏర్పడి సమాజానికి సేవలు అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సంఘ సహాయ కార్యదర్శి నరసింహారావు, కోశాధికారి రామనాథం, సభ్యులు సత్యమూర్తి పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



ఘటనా స్థలిలో మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్ఐ సునీత

కరప: కరప మండలంలో వలసపాకల గ్రామ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తి మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు కోనసీమ జిల్లా కొత్తపేట మండలం పూజారిపాలెం గ్రామానికి చెందిన పోనుగుపాటి రమేష్(31) రావులపాలెంలో స్వీట్ షాపులో పనిచేస్తుంటాడు. అతని రెండో కుమారుడు వివేక్‌వర్ధన్‌కు ఆపరేషన్ చేయించడానికి ఆదివారం కాకినాడ ప్రభుత్వాసుపత్రిలో చేర్పించాడు. అతని కుమారుడు హాస్పిటల్‌లో ఉండటానికి దుస్తులు తీసుకురావడానికి రమేష్ మోటార్ సైకిల్‌పై బయలు దేరి వెళుతుండగా వలసపాకల గ్రామసమీపంలోకి వెళ్లేసరికి రామచంద్రపురం వైపు నుంచి కాకినాడ వైపు వస్తున్న ఒక ప్రైవేట్ బస్సు వేగంగా హారన్ కొట్టకుండా వచ్చి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో రమేష్‌కు కుడి భుజంపై బలమైన గాయమై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుని సోదరుడు నటరాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కరప ఎస్ఐ టి.సునీత ఘటనా స్థలానికెళ్లి పరిశీలించి, మృతదేహాన్ని పోస్టుమార్టమ్ కోసం కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఎస్ఐ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

డిగ్రీ ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం



కందుల ఆంజనేయులు, ప్రిన్సిపాల్

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉన్నత విద్యామండలి ఖరారు చేసిన షెడ్యూల్ మేరకు 2025–26 విద్యా సంవత్సరానికి ప్రథమ సంవత్సరం డిగ్రీ కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు పీఆర్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ కందుల ఆంజనేయులు ఆదివారం తెలిపారు. ఆగస్టు 18వ తేదీ నుంచి కళాశాలలో రిజిస్ట్రేషన్లు మొదలవుతాయని ఇంటర్మీడియెట్ లేదా తత్సమాన కోర్సు పూర్తి చేసిన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ఆగస్టు 21వ తేదీ నుంచి 23వ తేదీ వరకూ ప్రత్యేక కేటగిరి పత్రాల పరిశీలన, 21వ తేదీ నుంచి 24వ తేదీ వరకూ కళాశాల ఎంపికకు ఆప్షన్ల నమోదు, 25 వరకూ వెబ్ ఆప్షన్ల మార్పుకు అవకాశం ఉందన్నారు. కళాశాల బోధన, బోధనేతర సిబ్బందితో కళాశాలలో సహాయ కేంద్రం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు ఆగస్టు 27న సీట్లు కేటాయించి 28న నుంచి తరగతులు ప్రారంభిస్తారని తెలిపారు.

మరిడమ్మ ఆలయానికి పోటెత్తిన భక్తులు



పెద్దాపురం మరిడమ్మ ఆలయంలో భక్తులకు అన్నదానం

పెద్దాపురం: భక్తుల కోరిన కోర్కెలు తీర్చే పెద్దాపురం మరిడమ్మ ఆలయానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ అసిస్టెంట్ కమిషనర్ కె.విజయలక్ష్మి ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలో వారంవారం నిర్వహించే అన్నదానానికి భక్తులు బారులుతీరారు. ఈ సందర్భంగా ఈఓ విజయలక్ష్మి మాట్లాడుతూ గత నెల ఆషాఢ మాస జాతర ఉత్సవాల్లో భాగంగా అన్నదానాన్ని తాత్కాలికంగా వాయిదా వేశామన్నారు. ఈ వారం నుంచి మళ్లీ దాతల సహకారంతో అన్నదానం నిర్వహిస్తున్నట్టు తెలిపారు. అమ్మవారి అన్నదాన కార్యక్రమానికి దాతలు సహకరించాలని ఆమె కోరారు

గణపతి నవరాత్రులకు రాట ముహూర్తం



మర్లావలో పందిరి రాట వేస్తున్న వైస్ ఎంపీపీ రాజా

పెద్దాపురం: ఈ నెల 27 నుంచి గణపతి నవరాత్ర ఉత్సవాలకు భక్తులు ఏర్పాట్లను ముమ్మరం చేశారు. మండలంలోని మర్లావలో వైఎస్సార్ సీపీ నాయకులు, వైస్ ఎంపీపీ, ఆలయ కమిటీ చైర్మన్ మిరియాల రాజా దంపతుల చేతుల మీదుగా ఆదివారం పందిరి రాట ముహూర్తం చేశారు. ఈ సందర్భంగా రాజా మాట్లాడుతూ తొమ్మిది రోజుల పాటు గణేష్ నవరాత్ర ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తామన్నారు. స్వామివారికి ప్రత్యేక పూజలతో పాటు పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ఉత్సవాలను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో కామన రామకృష్ణ, కాతా పెద్దకాపు తదితరులు పాల్గొన్నారు.

కొత్తపల్లి: గణపతి నవరాత్ర మహోత్సవాలకు మండలంలోని పలు గ్రామాల్లో ఆదివారం రాట ముహూర్తం చేశారు. వాకతిప్పలో ఆలయ కమిటీ, ఉత్సవ కమిటీల ఆధ్వర్యంలో పందిరి రాట వేశారు. ఈ నెల 27 నుంచి ప్రారంభం కానున్న గణపతి నవరాత్రులు సందర్భంగా ఆలయాల వద్ద స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. గణపతి విగ్రహాలు ఏర్పాటు చేయనున్న మందిరాల వద్ద ముత్తైదువులు పూజలు చేశారు.

సత్యదేవుని దర్శించిన జిల్లా ఎస్పీ



సత్యదేవుని సన్నిధిలో వేదపండితుల ఆశీస్సులు పొందుతున్న ఎస్పీ బిందు మాధవ్ దంపతులు

అన్నవరం: జిల్లా ఎస్పీ బిందుమాధవ్ ఆదివారం కుటుంబ సభ్యులతో కలిసి రత్నగిరిపై సత్యదేవుని దర్శించి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయం వద్ద వారికి అధికారులు ఘనంగా స్వాగతం పలికారు. స్వామివారి దర్శనం అనంతరం వేదపండితులు వేదాశీస్సులు అందజేయగా స్వామివారి ప్రసాదాలను ఈఓ వీర్ల సుబ్బారావు అందజేశారు.

పుష్కర కాలువకు వరద ముప్పు



పుష్కర కాలువ గరిష్ట ఎత్తుకు చేరిన వరద నీరు



స్లూయిజ్ నుంచి లీకవుతున్న నీరు

తుని రూరల్: మండలంలోని టి.తిమ్మాపురం సమీపంలో పుష్కర కాలువకు ముప్పు పొంచి ఉంది. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు ఎగువ ప్రాంతం నుంచి భారీగా వరద నీరు కాలువలో ప్రవహిస్తోంది. కాలువ గరిష్ట ఎత్తుకు వరదనీరు చేరింది. టి.తిమ్మాపురం నుంచి జాతీయ రహదారికి వచ్చే మార్గంలో రాకపోకలకు అంతరాయం లేకుండా ఉండేందుకు అండర్ కెనాల్ ఏర్పాటు చేశారు. నీరు ఉధృతంగా ప్రవహిస్తుడడంతో ఇప్పటికే రోడ్డుపై స్వల్పంగా వరనీరు చేరింది. కాలువలో గరిష్టంగా వరదనీరు ప్రవహిస్తుండడంతో గట్టు కోతకు గురయ్యే ప్రమాదం ఉందని స్థానిక రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. మరో పక్క అండర్ కెనాల్ నుంచి నీరు లీకవుతుండడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడే అవకాశాలు ఉందని స్థానికులు పేర్కొన్నారు. రాత్రివేళలో భారీ వర్షం కురిస్తే పుష్కర కాలువ గట్టు తెగిపోయే ప్రమాదం ఉంది. ఇప్పటికైనా ఇరిగేషన్ అధికారులు స్పందించి కాలువ గట్టు పటిష్టతకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

త్రిసభ్య కమిటీ ప్రమాణ స్వీకారం

తాళ్లరేవు: ఆరు గ్రామాల రైతులకు సంబంధించి లచ్చిపాలెం వ్యవసాయ సహకార పరపతి సంఘ త్రిసభ్య కమిటీ ప్రమాన స్వీకారం ఆదివారం జరిగింది. సొసైటీ అధ్యక్షుడిగా మోపూరి వెంకట రెడ్డి నాయుడు, డైరెక్టర్లుగా నీల లోవరాజు, కోరుకొండ వెంకటరమణ ప్రమాణ స్వీకారం చేశారు. సొసైటీ సీఈఓ కాజులూరి విజయభాస్కరరెడ్డి సభ్యులచే ప్రమాణ స్వీకారం చేయించారు. దీనికి ముమ్మిడివరం, యానాం ఎమ్మెల్యేలు దాట్ల సుబ్బరాజు, గొల్లపల్లి శ్రీనివాస అశోక్, మాజీ మంత్రి చిక్కాల రామచంద్రరావు ముఖ్య అతిథులుగా హాజరై సభ్యులను సత్కరించారు.

ఏసీఏ కార్యదర్శి 'సానా'కు అభినందనలు



ఏసీఏ కార్యదర్శిగా ఏకగ్రీవంగా ఎన్నికైన ఎంపీ సతీష్‌బాబుకు పుష్పగుచ్ఛం అందిస్తున్న హరీష్

నాగమల్లితోట జంక్షన్(కాకినాడ సిటీ): ఆంధ్రా క్రికెట్ సంఘం కార్యదర్శిగా ఏకగ్రీవంగా ఎన్నికైన రాజ్యసభ ఎంపీ సానా సతీష్‌బాబుకు జిల్లా మాజీ క్రికెట్ సంఘ అధ్యక్షుడు, సానా సతీష్‌బాబు చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ తలాటం హరిష్ పుష్పగుచ్ఛం అందించి అభినందనలు తెలిపారు. విజయవాడలో ఈనెల 16న ఏసీఏ ఎన్నికల అధికారి నిమ్మగడ్డ రమేష్ కుమార్ ఏసీఏ నూతన కార్యదర్శిగా సానా సతీష్‌బాబు ఏకగ్రీవంగా ఎన్నికైనట్టు ప్రకటించారు. ఈ సందర్భంగా హరీష్ మాట్లాడుతూ రానున్న రోజుల్లో జిల్లా క్రికెట్ మరితం అభివృద్ధి చెందుతుందన్నారు. ఏసీఏ కార్యదర్శి హోదాలో సతీష్‌బాబు మూడు సంవత్సరాలు పదవిలో కొనసాగుతారని, జిల్లా క్రికెట్ స్టేడియం మంజూరుకు చర్యలు తీసుకోవాలని జిల్లా క్రికెట్ అభిమానుల తరుపున సతీష్ బాబును కోరతానన్నారు.

మత్స్యకారులకు పరికరాల అందజేత



దానవాయిపేటలో మత్స్యకారులకు యంత్రాలను అందజేస్తున్న ఎమ్మెల్యే దివ్య

తొండంగి: వేట సమయంలో ఉపయోగపడే ట్రాన్స్‌ఫాండర్ యంత్రాలను మత్స్యకారులు సద్వినియోగం చేసుకోవాలని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యనమల దివ్య సూచించారు. తొండంగి మండలంలోని దానవాయిపేట మత్స్యకార కార్యాలయంలో 36 మంది మత్స్యకారులకు నూరుశాతం రాయితీపై మంజూరైన ట్రాన్స్‌పాండర్స్ యంత్రాలను ఆదివారం ఎమ్మెల్యే అందజేశారు. మత్స్యకారులు వేటకు వెళ్లే సమయంలో బోటుకు ఈ యంత్రాలను అమర్చుకోవాలని సూచించారు. మొబైల్ అప్లికేషన్‌లో ట్రాన్స్‌ఫాండర్ యంత్రాన్ని ఎస్ఓఎస్ బటన్ నొక్కడం ద్వారా వినియోగించవచ్చని ఎఫ్‌డీఏ సీహెచ్ ఉమామహేశ్వరరావు పేర్కొన్నారు. ఈ యంత్రాల వినియోగంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మత్స్యశాఖ అధికారులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

మధుర స్మృతులను నెమరువేసుకుంటూ..



పటవల హైస్కూల్లో కలుసుకున్న 1999-2000 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు

తాళ్లరేవు: వారంతా ఎక్కడెక్కడో స్థిరపడ్డారు.. ఉద్యోగ, వ్యాపార రీత్యా దూర ప్రాంతాల్లో ఉన్నారు.. వారంతా తాము చదువుకున్న పాఠశాలలోనే కలుసుకోవాలని నిర్ణయించుకున్నారు. అనుకున్న తడవుగా నెలరోజుల లోపులోనే ఎక్కడెక్కడ ఉన్న వారందరినీ ఒకచోటకు చేర్చి ఆనాటి మధుర స్మృతులను నెమర వేసుకున్నారు. పటవల శ్రీమతి, శ్రీపోలిశెట్టి వీరాంజనేయులు జిల్లా పరిషత్ హైస్కూల్‌లో 1999–2000లో పదో తరగతి చదివిన విద్యార్థులంతా సుమారు 25 ఏళ్ల తర్వాత ఆదివారం వారు చదువుకున్న పాఠశాలలోనే కలుసుకున్నారు. ఒకరికొకరు ఆప్యాయంగా పలకరించుకుంటూ ఆనంద డోలికల్లో మునిగి తేలారు. అలనాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. రోజంతా ఆటపాటలతో ఆనందంగా గడిపారు. తోటి స్నేహితులతో కలసి కబుర్లు చెప్పుకొంటూ సహపంక్తి భోజనాలు చేశారు. అనంతరం వారికి విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులు మందాల వీరభద్రరావు, కాకర్లపూడి సత్యనారాయణ, శివ సత్యనారాయణలకు పాదపూజ చేసి దుశ్శాలువాలతో ఘనంగా సత్కరించారు. పూర్వ విద్యార్థులు చెక్కా అజయ్‌వర్మ, కట్టా శ్రీనివాసరావు తదితరులు మాట్లాడుతూ చాలా ఏళ్ల తరువాత చిన్ననాటి మిత్రులను కలుసుకోవడం మధురానుభూతిని కలిగించిందన్నారు. కార్యక్రమంలో స్కూల్ హెచ్ఎం సలాది వెంకటనారాయణ పాల్గొన్నారు.